క్లుప్తంగా

కన్నెపల్లి పశువైద్యాధికారిగా రామకృష్ణ


బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణ

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ పశువైద్యశాలలో సోమవారం పశువైద్యాధికారి రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన పశువైద్యాధికారి హారిక హాజీ పూర్ మండలంలోని దొనబండ పశువైద్యశాలకు బదిలీపై వెళ్లారు. తిర్యాణి నుంచి బదిలీపై వచ్చిన రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది, రైతులు స్వాగతం పలికారు.

2వ వార్డులో మెడికల్ క్యాంప్


శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో సోమవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ప్రభుత్వ వైద్యురాలు మానస ఆధ్వర్యంలో వార్డు ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించడంతో పాటు జ్వరాలతో బాధపడుతున్న వారికి మందులు ఇచ్చారు. దీనికి ముందు కాలనీలో పలు ఇళ్లను సందర్శించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వర్షాకాలం దృష్ట్యా దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, వార్డు ఆఫీసర్ నరేందర్, ఏఎన్ఎం పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా నస్పూర్ కమిటీ ఎన్నిక


మైదం రామకృష్ణ


ఊట్ల సత్యనారాయణ

నస్పూర్: పట్టణ ట్రస్మా (తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. జిల్లా ట్రస్మా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రపాణి, రాష్ట్ర సహాయ కార్యదర్శి పెట్టం మల్లయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్ ఆధ్వర్యంలో సీసీసీలోని సృష్టి ఇన్‌స్టిట్యూట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణా కాలనీలోని ఏయిమ్స్ పాఠశాల కరస్పాండెంట్ మైదం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా లిటిల్‌రోజెస్ పాఠశాల కరస్పాండెంట్ ఊట్ల సత్యనారాయణ, కోశాధికారిగా సృష్టి ప్లే స్కూల్ కరస్పాండెంట్ అంబాల రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా రెయిన్ బో ప్లే స్కూల్ కరస్పాండెంట్ చెన్నూరి అమన్ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన సభ్యులు

నస్పూర్: పట్టణ సీపీఐ నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. సీసీసీలోని నర్సయ్య భవన్‌లో సోమవారం జరిగిన పార్టీ నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో పట్టణ కార్యదర్శిగా మిర్యాల రాజేశ్వర్‌రావు, సహాయ కార్యదర్శులుగా తంగళ్లపల్లి సురేష్, దొడ్డిపట్ల రవీందర్, కోశాధికారిగా గుడెల్లి రాజన్నలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, సహాయ కార్యదర్శి లింగం రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు కారణమవుతున్న పశువులు?


జన్నారం: మండల కేంద్రంలో పశువులు రోడ్లపై చేరి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. టీజీ పల్లి సమీపంలో ఇటీవల ఆవులు అడ్డం రావడంతో తప్పించబోయి నార్నూర్‌కు చెందిన కానిస్టేబుల్ చెట్టుకు కారు ఢీ కొట్టుకోవడంతో అతడి కొడుకు మరణించాడు. అదే విధంగా సోమవారం జన్నారం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై నిలిచిన ఆవులను తప్పించబోయి బైక్ అదుపు తప్పి పడిపోగా ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇలా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పశువులు రోడ్లపై రాకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు మహేష్, విజయ్, తిరుపతిలు కోరుతున్నారు. ఈ విషయంపై పొనకల్ ఈవో రాహుల్‌ను సంప్రదించగా పశువులు రోడ్లపై ఉండకుండా ఇప్పటికే ఆటో మైక్ ద్వారా హెచ్చరించినట్లు, అయితే యజమానులు పట్టించుకోకపోతే వాటిని బంజరుకు తరలించి, ఒక్కో పశువుకు రూ.1000జరిమానా విధిస్తామన్నారు.

సాగునీటి కాలువలు అధ్వానం..!


డిస్ట్రిబ్యూటరీ 26 కాల్వలో పిచ్చిమొక్కలు

- పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు
- దెబ్బతిన్న లైనింగ్, తూముల షెట్టర్లు


ఎస్‌డీ 5కాలువలో పెరిగిన తుంగ


37డిస్ట్రిబ్యూటరీ కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు


38డిస్ట్రిబ్యూటరీ కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

దండేపల్లి/లక్సెట్టిపేట: కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువలు, సబ్ డిస్ట్రిబ్యూటరీ కాల్వలు, ఫీడర్ చానల్స్ అధ్వానంగా ఉన్నాయి. ప్రస్తుతం వానాకాలం సాగుకు ప్రాజెక్టు నీటిని వదిలారు. కానీ చాలా చోట్ల డిస్ట్రిబ్యూటరీ కాల్వల్లో పిచ్చిమొక్కలు మొలవడంతో పాటు, చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో కొన్నిచోట్ల సాగునీరు ముందుకెళ్లడం ఇబ్బందిగా మారింది. లక్సెట్టిపేట పరిధిలో ప్రస్తుతం 16,850ఎకరాల వరి పొలాలు, 5340ఎకరాల పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు. దండేపల్లి మండలంలో కడెం ప్రాజెక్టు కింద సుమారు 18వేల ఎకరాలు సాగు చేశారు. వానాకాలం సాగుకు ముందు కనీసం కాల్వల్లో పిచ్చిమొక్కల తొలగింపు, చెత్తను తొలగించడం గురించి సంబంధిత అధికారులు దృష్టిసారించకపోవడంతో, నీటిని విడుదల చేసినప్పుడల్లా అక్కడక్కడా రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాల్వల్లో పిచ్చి మొక్కలు మొలవడమే కాకుండా అక్కడక్కడ తూముల షెటర్లు పాడైపోయాయి, లైనింగ్‌లు దెబ్బతిన్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకొని ఇప్పటికైనా మరమ్మతు చర్యలు చేపడితే రైతులకు సాగు చేసే పొలాలకు నీరు అందుతుందని పలువురు కోరుతున్నారు. దండేపల్లి మండలంలోని తాళ్లపేట సమీపంలో డీ–22 కాలువ లైనింగ్ దెబ్బతినడంతో రైతులు తాత్కాలికంగా ఇసుక సంచులు అడ్డుగా వేసి, నీళ్లు పక్కకు వెళ్లకుండా చేశారు. ఈ విషయమై దండేపల్లి ఇరిగేషన్ ఏఈఈ సంజీవను సంప్రదించగా కాల్వల మరమ్మతులను గురించి ప్రతిపాదనలు పంపించినట్లు, నిధులు మంజూరు కాకపోవడంతో పనులు చేపట్టలేదని తెలిపారు. పిచ్చిమొక్కలు ఈజీఎస్ ద్వారా తొలగిస్తామని చెప్పారు. లక్సెట్టిపేట ఇరిగేషన్ డీఈ దశరథ్‌ను సంప్రదించగా నిధుల మంజూరు కోసం అధికారులకు విన్నవించినట్లు, కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాలేదని తెలిపారు.

పులుల సంరక్షణపై అవగాహన



మందమర్రిరూరల్: అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని పొన్నారం, వెంకటాపూర్ గ్రామ పంచాయతీల్లో ప్రజలకు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ విజయలక్ష్మి, బీట్ ఆఫీసర్ రమేష్ పులుల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ లింగయ్య, సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

పులుల సంరక్షణ అందరి బాధ్యత

నెన్నెల: జీవవైవిధ్యానికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్న పులులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కుశ్నపల్లి రేంజ్ ఆఫీసర్ గోవింద్‌చంద్ సర్దార్ అన్నారు. నెన్నెల, ఆవుడం గ్రామాల్లో అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ, కుశ్నపల్లి, లింగాల, రెబ్బెన సెక్షన్ ఆఫీసర్లు మల్లయ్య, శ్రీలత, రాజేష్, ఎఫ్‌బీఓలు శంకర్, శ్రీనాథ్, కృష్ణలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు


మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ


కార్ల బ్లాక్ ఫిలింలు తొలగిస్తున్న ట్రాఫిక్ సీఐ

చెన్నూర్: మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే చర్యలు తీసుకుంటామని స్థానిక సీఐ రవీందర్ అన్నారు. పట్టణలో ఆదివారం రాత్రి పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధుల్లో ముగ్గురు మైనర్లు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ తిరుగుతుండగా పోలీసులు పట్టుకున్నారు. తల్లిదండ్రుల సమక్షంలో సోమవారం మైనర్లకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇవ్వొద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్ బాలుర తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్లకు బ్లాక్ ఫిలిం తొలగించాల్సిందే..

మంచిర్యాలక్రైం: ఫోర్ వీలర్ వాహనాల అద్దాలకు ఉన్న బ్లాక్ ఫిలింను తొలగించాల్సిందేనని ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ట్రాఫిక్ నిబంధలపై సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఐబీ చౌరస్తాలో.. ఆటో డ్రైవర్లకు, ఫోర్ వీల్ డ్రైవర్ల యజమానులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కొత్త చట్టాల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లు ఇష్టారీతిన పార్కింగ్ చేస్తూ, ఇతర వాహనాలకు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

వేమనపల్లి: మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో సోమవారం ఎస్సై శ్యాం పటేల్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. మండలం తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో వచ్చి పోయే వ్యక్తులపై నిఘా ఉంచారు. వాహనాలు క్షుణ్ణంగా పరిశీలిస్తూ తనిఖీలు చేశారు. వ్యక్తుల వివరాలు, గుర్తింపు కార్డులను పరిశీలించి ఎక్కడి నుంచి ఎటు వైపు వెళ్తున్నారు అనే వివరాలు అడిగారు. వారి వద్ద ఉన్న వస్తువులను పరిశీలించి అపరిచిత వ్యక్తులు కనబడితే సమాచారం ఇవ్వాలని వాహనచోదకులకు సూచించారు.

పారిశుధ్య పనులు చేపట్టాలని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని పెర్కపల్లి గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులు చేపట్టడం లేదని గ్రామస్తులు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో కొన్ని రోజులుగా పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో పారిశుధ్య సమస్య తలెత్తి దోమల బెడద విపరీతంగా పెరిగిందని మండిపడ్డారు. రోజువారీగా చెత్త సేకరణ జరగక రోడ్ల పక్క చెత్త పేరుకపోయి ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. చెడిపోయిన వీధి దీపాలను మరమ్మతులు చేయించడంలో గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు తీవ్రంగా విఫలమయ్యారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, అధికారులు సమస్యల పరిష్కారంపై స్పందించడం లేదని వాపోయారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

'క్రీడా ప్రాంగణాలతో ప్రజల సొమ్ము దుర్వినియోగం'


హాజీపూర్‌లో క్రీడా ప్రాంగణం వద్ద బీజేపీ నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా వ్యాప్తంగా అనాడు కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నేడు అలంకారప్రాయంగా మారాయని పేర్కొంటూ, ప్రజల సొమ్ము మొత్తం దుర్వినియోగం చేసిందని బీజేపీ నాయకులు ఈ సందర్భంగా మండిపడ్డారు. హాజీపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను సోమవారం సందర్శించారు. ఎలాంటి ప్రణాళిక లేకుండా ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసి ఒక బోర్డు మాత్రమే పెట్టేసి ప్రజల నెత్తిన టోపీ పెట్టారని ఆరోపించారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా క్రీడా ప్రాంగణాలు క్రీడాకారులు వినియోగించుకునేలా చూడటంతో పాటు ప్రాంగణాలకు హద్దులు ఏర్పాటు చేసి, ఎంత భూమి కేటాయింపు జరిగింది, ఎంత ఖర్చు పెట్టారు అనే తదితర వివరాలతో సూచిక బోర్డు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి, బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం స్వామిరెడ్డి, నాయకులు మోటపలుకుల తిరుపతి, రమణారావు, సత్యం, ప్రశాంత్, మల్లేశ్, శ్రీనివాస్, నరేశ్, సతీశ్ పాల్గొన్నారు.

'బీజేపీపై విమర్శలు చేస్తే సహించం'


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, బీజేపీపై విమర్శలు చేస్తే సహించబోమని బీజేపీ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అన్నారు. కాంగ్రెస్ నాయకులు బీజేపీతో పాటు, తమ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లిపై చేస్తున్న తప్పుడు ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, రైతులకు రైతు భరోసా, రుణమాఫీ, నీట మునిగిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తే, అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాకు అన్యాయం జరిగిందని, అభివృద్ధి పనులను ఎలా చేపడతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, పట్టి వెంకటకృష్ణ, దుర్గం అశోక్, జోగుల శ్రీదేవి, మోటపలుకుల తిరుపతి, పానుగంటి మధు, మాదవరపు రమణరావు, బొద్దున మల్లేశ్, కర్రె లచ్చన్న, కేశెట్టి నాగేశ్వర్‌రావు, రమేశ్ పాల్గొన్నారు.

కాలం చెల్లిన వైర్లతో కష్టాలు

- ఇబ్బందుల్లో రైతులు
- పట్టించుకోని అధికారులు


నెల్కివెంకటాపూర్ సమీపంలో తెగిన ఏబీ కేబుల్‌కు అతుకులు

దండేపల్లి: మండలంలో వ్యవసాయ విద్యుత్ మోటార్ల కనెక్షన్ కోసం ఏర్పాటు చేసిన ఏబీ కేబుల్(త్రీపేజ్ ఏరియల్ బంచుడ్ కేబుల్) కాలం చెల్లిపోయింది. దీంతో చాలాచోట్ల అధిక లోడ్‌తో తీగలు వేడెక్కి తెగిపోతున్నాయి. అయినా కొత్త కేబుల్ వేయకుండా అతుకులు (జాయింట్) వేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. అతుకుల వైర్లతో రైతులకు తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దండేపల్లి మండలంలో సుమారు 7వేలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటికి త్రీఫేజ్ సరఫరా కోసం సుమారు తొమ్మిదేళ్ల క్రితం వేసిన ఏబీ కేబుల్ ఇప్పటికీ మార్చకపోవడంతో, అది కాలం చెల్లిపోయింది. కొత్త కేబుల్ ఏర్పాటు విషయంలో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కేబుల్ పాడయిపోవడంతో దానికి ఉన్న వ్యవసాయ మోటారు కనెక్షన్ల మోటార్లు సరిగ్గా నడవకపోవడం, పైగా సర్వీస్ వైరు కాలిపోవడంతో ఖరీఫ్ ప్రారంభంలోనే రైతులు కరెంట్ కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలం చెల్లిన ఏబీ కేబుల్‌ను తొలగించి, కొత్తది వేసి, రైతులకు కరెంట్ కష్టాలు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ రాయనర్సును ఫోన్‌లో సంప్రదించగా కొత్త ఏబీ కేబుల్ గురించి అంచనా వేశాం. త్వరలో ఉన్నతాధికారులకు నివేదిక పంపించి, కొత్త కేబుల్ మంజూరు కాగానే పాతది తొలగించి, కొత్తది వేస్తామని చెప్పారు.

కూలిన ఇళ్లు


కూలిన ఇప్ప సమ్మయ్య ఇంటి గోడ

వేమనపల్లి: మండల కేంద్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇంటి గోడలు తడిసి ఉండటంతో కూలిపోతున్నాయి. మండల కేంద్రంలోని ఇప్ప సమ్మయ్య, తోకల లస్మక్కలకు చెందిన ఇంటి గోడలు నేలమట్టమయ్యాయి. రాత్రి పడుకునే సమయంలో గోడలు కూలడంతో పెను ప్రమాదం తప్పిందని బాధితులు వాపోతున్నారు. పరిహారం ఇప్పించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మల్లికార్జున్



చెన్నూర్: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ భవనంలో సోమవారం ఆర్యవైశ్య సంఘం మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముక్త శ్రీనివాస్ హాజరయ్యారు. చెన్నూర్ మండల ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా చిలువేరు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా కుక్కడపు నరేందర్, కోశాధికారిగా చకినారపు హరీశ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆర్థిక సాయం అందజేత

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట గ్రామానికి చెందిన అడప మల్లేష్ మూడు రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. దీంతో ఆయన కుటుంబానికి మాజీ వైస్‌ఎంపీపీ రాజేందర్ రూ.5వేల ఆర్థిక సాయం సోమవారం అందించారు.

మందమర్రిరూరల్: తల్లిదండ్రులను కోల్పోయిన ఊరు మందమర్రికి చెందిన అర్చన, అభిలాషలకు ఆటో కార్మిక సేవా సమితి, ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి సోమవారం కొంత నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో ఆటో కార్మిక సేవా సంస్థ పట్టణ అధ్యక్షుడు రాంబాబు, నాయకులు, ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అజీమొద్దీన్, నాయకులు ఉన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

వేమనపల్లి: మండలంలో విద్యుత్ సరఫరా విషయంలో విద్యుత్‌శాఖ అధికారుల తీరు మారడం లేదు. ఎలాంటి ముందస్తు ప్రకటనలు ఇవ్వకుండానే పొద్దంతా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. కేవలం ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు అరగంట సమయం తీసుకోవాల్సింది పోయి, ఉదయం 10.40నిమిషాలకు తొలగించిన కరెంట్ సాయంత్రం 6.30 గంటల వరకు సరఫరా నిలిపివేశారు. దీంతో వినియోగదారులకు ఇబ్బందిగా మారింది. అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థిని మృతికి సంతాపం

శ్రీరాంపూర్: ఢిల్లీ వరద ప్రమాదంలో మృతి చెందిన ఎస్ఆర్పీ 1 గని మేనేజర్ విజయకుమార్ కూతురు సోనికి హెచ్ఎమ్మెస్ నాయకులు ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు సారయ్య, కార్యదర్శి అనిల్ రెడ్డి, ఫిట్ సెక్రటరీ సందీప్ సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. విద్యార్థిని ఉన్నత చదువుల కోసం ఎన్నో కలలుగని ఢిల్లీ లో శిక్షణ పొందుతూ మృతి చెందడం కలిచి వేసిందన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. ప్రమాదానికి కారణమైన వారిపై ఢిల్లీ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సోని మృతిపై మాజీ ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలోని నస్పూర్ మున్సిపాలిటీ ఎస్సార్పీ 1 భూగర్భ గని డీజీఎం విజయ్‌కుమార్ కూతురు సోని, ఐఏఎస్ కోచింగ్‌కు ఢిల్లీ వెళ్లి వరదల కారణంగా మృతి చెందడంపై మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే సోని మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లుగా ఒక ప్రకటనలో తెలిపారు.

వానర సైన్యం!



దండేపల్లి: అడవుల్లో ఉండాల్సిన కోతులు, గ్రామాల్లోకి వచ్చాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దండేపల్లి మండలంలోని నాగసముద్రం సమీపంలో సోమవారం రహదారిపై వానరసైన్యం 20నిమిషాల పాటు బైఠాయించాయి. వానర సైన్యాన్ని చూసి భయ భ్రాంతులకు గురైన వాహనదారులు అవి రోడ్డు పైనుంచి వెళ్లి పోయేదాక, వాహనాలను పక్కకు నిలిపి ఉంచారు.

గోరింటా పండింది



శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో సోమవారం సేవా సమితి ఆధ్వర్యంలో గోరింటాకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గోరింటాకు దంచి మహిళలంతా చేతులకు పెట్టుకొని పండిన గోరింటాకును చూసి మురిసిపోయారు. - శ్రీరాంపూర్

ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని వినతి


సమస్యలు విన్నవిస్తున్న కాలనీవాసులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలోని రాజన్న కాలనీవాసులు ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని, తాగు నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ సింగరేణి పరిరక్షణ బస్సు ప్రారంభ సభకు హాజరైన ముఖ్య అతిథి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందించి ఈ సందర్భంగా పట్టాలిచ్చి అన్ని సౌకర్యాలు కల్పించేంత వరకు మీ వెనకాల ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బోడంకి చందు, రవి, సమ్మక్క, ఉమారాణి, నాగజ్యోతి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.